# బ్రహ్మచారి బ్రదర్లు




ఎస్.వి.
సత్యనారాయణ
మూర్తి

*ఎవరి గీత వారిది అని సరిపెట్టుకోవడం అంతటి అవివేకం వేరొకటి ఉండదు. అర్జునునికి శ్రీకృష్ణ పరమాత్ముని వలె బ్రహ్మచారి బ్రదర్సుకు హితోపదేశం చేయ పూనుకొన్నాడు సుబ్బారావు—ఉదాత్త గంభీరుడు; స్వయంగా నాయకత్వం కట్ట బెట్టుకొన్న వాడూను. పెళ్లి చేసుకున్న కొన్నాళ్ళకు పెళ్ళాల చేతుల్లో కీలు బొమ్మలై, తోలు బొమ్మలై, కుటుంబయ్యలు కుచేలరావులు అయిపోతారని హెచ్చరించాడు. ఏమి చేస్తారో చూద్దాం!*

"ఛీ! తెలివి తక్కువ దద్దమ్మల్లారా!" సుబ్బారావు ధుమధుమలాడుతూ చేతిలోగరిటె గాల్లోకి విసిరేసి, విసురుగా లేచిపోయాడు.

తెలివితక్కువ దద్దమ్మలుగా నిరూపించ బడిన మిగతా బ్రహ్మచారి చతుష్టయం బిక్క మొహాలువేసి, గరిటె మీదపడుతుందనే భయం కొద్దీ వారి చేతిలో ఉన్నది వారు శిరస్త్రాణాలుగా చేసుకున్నారు. రెండోస్టవ్ ముట్టించే ప్రయత్నంలోఉన్న శేషాచారి తలను పరామర్శిస్తూ క్రిందికి దిగింది, సుబ్బారావు గాలిలోకి పంపిన అస్త్రం.

అసలు సుబ్బారావుకు అంతకోపం ఎందుకొచ్చిందీ?

ఆనాడు బ్రహ్మచారి బ్రదర్సు అనబడే మిత్రపంచకానికి స్వయంగా కాఫీ, ఫలహారాలు వేయాలనే దుర్బుద్ధి సమష్టిగా పుట్టింది. హోటల్‌కు పోయి తగలెయ్యడానికి తగినంత డబ్బు లేదుగనక ఆ తీర్మానం ఏకగ్రీవంగా అందరూ ఆమోదించారు. ఆరునెలల్లో వారందరూ కలిసి అంగీకారం చూపినది దీనికి ఒక్కదానికే. ఆరోజు తమ స్నేహ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింపదగ్గదనే అభిప్రాయం ఫిలాసఫీ స్పెషలిస్టు పుల్లారెడ్డి వెల్లడించాడు. ఏ కంపెనీ వారూ ఇంతవరకూ బంగారంతో సిరా తయారు చేయనందుకు నిమిషంపాటు విచారించి, చివరికి పార్కర్ ఇంకుతో తన డైరీలో వ్రాసుకున్నాడు పుల్లారెడ్డి. రమణారావు వీధి చివరి దుకాణానికి తన సైకిలు మీద అర్జంటుగా వెళ్లిపోయి సెనగపిండి, మైదాపిండి, గోధుమ రవ్వ, చక్కెర, కాఫీపొడి అరువు తీసుకొనివచ్చేశాడు. శేషాచారీ, శ్రీపతీ రెండునెల్ల క్రితం కొన్ని పాక కళను గూర్చిన పుస్తకాలు తీసి హడావుడిగా చదివేయ సాగారు. సుబ్బారావు స్టవ్ ముట్టించే ప్రయత్నంలో నిమగ్నుడయ్యాడు.

రమణారావు కూడా తొందరగా తన సూట్ కేసులోంచి ఒక పుస్తకం తీసుకున్నాడు. శ్రీపతి అదేమిటని అడిగాడు. రమణారావు "దీనిపేరు వంటా—వార్పూ. వంటను గూర్చి చెప్పడంలో దీన్ని మించిన పుస్తకం లేదనుకో"అన్నాడు. శ్రీపతి "నాదగ్గర కొయ్యకురా అబ్బాయ్! ఈ వంటలూ పిండివంటలూ మించిన పుస్తకం మొత్తం ఆంధ్రభాషలోనే లేదు. ఉంటే నేను నా కతిప్రియతమమైన ఉల్లిపాయ పకోడీ ఇక జన్మలో ముట్టుకోను. పందెం కట్టు" అన్నాడు.

అంతదాకా నిశ్శబ్దంగా ఉన్న శేషాచారి కలగజేసుకున్నాడు. "ఒరే! మీకు బుద్ధెప్పుడు వస్తుందిరా? ఎవరో వ్రాసిన పుస్తకాలు పట్టుకొని ఊరికే కోడిపుంజుల్లా కాట్లాడుకుంటున్నారు. ఇదిగో ఇది చూడండి. 'నల భీమ పాకకళా శాస్త్రం.' దీన్ని మించిన పుస్తకం హోల్ ఇండియాలో లేదని గ్యారంటీ ఇస్తాను". గ్రూపులీడరు సుబ్బారావు రంగంలోకి వచ్చాడు.

మిగతా నలుగురి అభిప్రాయాలు వేరైనపుడు సుబ్బారావుమాటే మెజారిటీ క్రింద చెల్లడం మిత్ర సంఘంలో రివాజు. శాసనసభ సభాపతి రూలింగు ఇచ్చినట్లు సుబ్బారావు ఆర్డర్లు వేస్తాడు. సుబ్బారావు మాటలతోనూ, ఒకప్పుడు అర్ధచంద్ర ప్రయోగాలతోనూ సభ్యుల్ని అదుపులో పెడుతూ ఉంటాడు.

"ఆగండిరా బడుద్ధాయిల్లారా! ఏ పుస్తకమైతేనేం, వండి పారెయ్యడానికి. ఒరేయ్! శేషాచార్లూ! ఏం చేద్దామంటావ్?" సుబ్బారావు మాట నోట్లో ఉండగానే గబగబా పుటలు తిరగెయ్యసాగాడు శేషాచారి. ఈలోగా అత్యుత్సాహంతో ముందుకువచ్చాడు శ్రీపతి, "ఉల్లిపాయ పకోడీలురా?" అంటూ. "నోర్మూయ్యరా". సుబ్బారావు పొంగిపొర్లిపోతున్న శ్రీపతి ఉత్సాహం మీద చెంబెడు చన్నీళ్ళు పోసినట్లు చల్లార్చేశాడు. "నీది నాలికా! లేక ఉల్లిపాయ చీలికా! ఉల్లిపాయపకోడీట. ఉల్లిపాయపకోడీ. నెలరోజులు దాకా దాని పేరెత్తావో పీక పిసికి అవతల గిరాటేస్తా. ఇక నీకు ఉల్లిపాయ తినే అర్హత లేకుండాచేసేస్తాను." ఒంటికాలిమీద లేచాడు సుబ్బారావు. శ్రీపతి ముఖానికి అడ్డంగా పుస్తకం ముంచుకొని ఒకమూల నక్కాడు. రమణారావు ఇదే మంచవకాశమని అందుకున్నాడు—"అరిటి కాయ బజ్జీ" అంటూ. నేనేం తక్కువ తిన్నానని పుల్లారెడ్డి అన్నాడు: "వెజిటబుల్ పులావ్" పిరికితనం పాలు కాస్త జాస్తీగా ఉన్న శేషాచారి మెల్లగా ఏదో గొణిగాడు. సుబ్బారావు ఏదో వంక పెట్టి ఎద్దేవా చేస్తాడనే భయం శేషాచారికి మహా ఎక్కువ. "చెప్పరా"అంటూ సుబ్బారావు శేషాచారిని ప్రోత్సహించాడు. రెండు నిమిషాలు నాన్చి, నాన్చి చివరికి శేషాచారి "ఉప్మా" అన్నాడు. సుబ్బారావు ఉప్మా తయారు చేయబోతున్నట్లు అందరి తరఫునా ప్రకటించేశాడు.

శ్రీపతీ, రమణారావూ, శేషాచారీ తమ, తమ పుస్తకాల్లో ఉన్న ఉప్మా తయారుచేసే విధానాన్ని ఆకళించుకొనసాగారు. సుబ్బారావు, పుల్లారెడ్డి చెరో స్టవ్‌ను ముందుకు లాగి వాటిని వెలిగించడానికి తంటాలు పడుతున్నారు. పుల్లారెడ్డి పావుగాలను కిరసను పోసేసి, స్టవ్ అడుగున అగ్గిపుల్లగీసి పడేశాడు. భగ్గుమంటూ మంట లేచింది.


సుబ్బారావు ఎగిరి గంతేసి, మంటలో పడబోతున్న పుల్లారెడ్డిని రెక్కపట్టుకుని లాగేసి తిట్టిపోశాడు. రమణారావుకు స్టవ్‌ను ఆర్పమని ఆర్డర్ జారీ చేశాడు. రమణారావు కూజాలో ఉన్న నీళ్ళన్నీ స్టవ్‌మీద దిమ్మరించాడు. స్టవ్ చప్పగా చల్లారిపోయింది. గదంతా వరదయింది. సుబ్బారావు రమణారావును కూడా యథాశక్తి దీవించి, శేషాచారిని పిలిచాడు. శేషాచారి కాస్సేపు స్టవ్‌తో కుస్తీపట్టి, వెలిగించాడు. "ఉప్మాకు కావలసిన సరుకులు చెప్పండోయ్" అన్నాడు సుబ్బారావు. అర్ధశేరు గోధుమ నూక, తగినంత నీరూ అని శ్రీపతీ, పానున్నర రవ్వ, అంతకు రెట్టింపు పరిమాణం నీరూ అనిరమణారావూ, రెండు పడులరవ్వ,అవసరమైనంత నీరూ అని శేషాచారీ లిస్టులు ఒకేమారు ప్రారంభించారు. ఇదీ సుబ్బారావు కోపానికి నాందీ ప్రస్తావన. తరువాత జరిగిన కథేమిటో మీకూ తెలుసు.

సుబ్బారావు అలా ఆగ్రహించినవాడై, ఉగ్ర నరసింహావతారంలా కుర్చీలో కూర్చుని సిగరెట్ (లు) కోపంగా పీల్చేస్తున్నాడు. మిగతా నలుగురూ గుసగుసలాడారు. శేషాచారి అడుగులో అడుగు వేసుకుంటూ అయిదోనిమిషంలో నాలుగో సిగరెట్‌ను తగలబెట్టేస్తున్న సుబ్బారావును సమీపించి "సుబ్బారావ్" అన్నాడు మెల్లిగా. "ఏమిటి"—సుబ్బారావు గర్జన నాలుగడుగులు వెనక్కు నడిపించింది. "ఒరే, సుబ్బారావ్! ఇవి చేతులు కావనుకో. మా అందరి తప్పులూ క్షమించి, నీ ఇష్టంవచ్చిన విధంగా చెయ్యరా" అన్నాడు శేషాచారి గజం దూరాన నిలబడే. సుబ్బారావు రాజీకి వచ్చాడు. "శేషాచారి తప్ప మీరెవరూ నోరెత్తకూడదు" అని మాటనలభై నాలుగో సెక్షన్ జారీచేసి, కుర్చీ దిగాడు సుబ్బారావు.

రెండోస్టవ్ ఎంత ప్రయత్నించినా వెలగడం లేదు. సుబ్బారావు "సెకండియర్ ఇంజనీర్ గారూ"అని కేకేశాడు. రమణారావు వచ్చి వినయంగా నిలబడ్డాడు. "దీనికి రోగమేమిటో చూసి, కాస్త కుదిర్చిపెట్టు"అన్నాడు సుబ్బారావు. రమణారావు "నాది ఎలక్ట్రికల్ ఇంజనీరింగూ"

*"మనం చెప్పేది నిజమో అబద్ధమో చెప్పే యంత్రం ఒకటి పోలీస్‌స్టేషన్‌లో చూచాను."*

*"దానిలో గొప్ప ఏముంది? నేను అలాంటి యంత్రాన్ని పెళ్ళాడాను, తెలుసా?"*



పాండురంగస్వామి ఆలయం (చిలకలపూడి)

ఫోటో—జి. అప్పయ్యశాస్త్రి (కరీంనగరం)

# బ్రహ్మచారి బ్రదర్సు

అంటూ నీళ్ళు నములుతున్నాడు. సుబ్బారావు రమణారావును మింగేసేలా చూసి "అంతకంటే చేతకాదని చెప్పరాదూ" అని, స్వయంగా ఆపనికి పూనుకున్నాడు. అయిదు నిమిషాల తర్వాత సుబ్బారావు అమెరికాను కనిపెట్టిన కొలంబస్ ముఖంపెట్టి "దీంట్లో అసలు కిరసనాయిలు లేందే ఎలా వెలుగుతుందీ?" అంటూ కిరసనాయిలు పోశాడు. స్టవ్ వెలిగింది. సుబ్బారావు ముఖం చాటంతైంది. రమణారావు నయాపైసంత ముఖం చేసుకున్నాడు.

శేషాచారిని పిలిచి లిస్టు చదవ మన్నాడు సుబ్బారావు. శేషాచారి లిస్టు చెబుతూంటే సుబ్బారావు అన్నీ ఉజ్జాయింపుగా వేయసాగాడు. "ఉప్పు 14 తులాలు" అన్నాడు శేషాచారి. సుబ్బారావు కాస్సేపు సందేహించాడు. శేషాచారి మళ్ళీ చెప్పాడు సుబ్బారావు వి న లే దే మో న ని. సుబ్బారావు మూడు పిడికిళ్ళ ఉప్పు వడేశాడు. "అంతే"అన్నాడు శేషాచారి పుస్తకం మూసేస్తూ. సుబ్బారావు గిన్నెమీద మూతపెట్టి, కళ్ళు మూసుకుని కూర్చున్నాడు. మిగతావారు మీనమేషాలు లెక్కిస్తున్నారు. శ్రీపతి గడియారం మీదనే దృష్టినిలిపి,కాలాన్ని లెక్కించసాగాడు. రమణారావు రాబోయే ఉప్మా రుచి తలచుకొని లొట్టలు వేస్తున్నాడు. పుల్లారెడ్డి తనకు జరిగిన అవమానం తలచుకొని చింతిస్తున్నాడు. సుబ్బారావు ఎగ్జిబిషన్‌కు వెళ్లడానికి ప్రణాళిక వస్నుతున్నాడు. శేషాచారి కాఫీనీళ్ళు ఒకకంట చూస్తూ, మరొక వంక తనకు రెండునెలల్లో జరగబోయే పెళ్ళిని గూర్చి కలలు కంటున్నాడు.

"సార్! పోస్టు!" అన్న కేకతో, అందరూ ఆలోకంలోకి ఊడిపడ్డారు. అందరూ ఒకేమారు అవతలకు వివిధ వేగాల్లో పరుగెత్తి చేతులు చాచారు. పోస్టుమన్ వారివంక విచిత్రంగా చూచి "పుల్లారెడ్డిగారికి సార్"! అన్నాడు. పుల్లారెడ్డి సగర్వంగా ముందుకువెళ్లి "నేనే" అన్నాడు. "కవర్. బేరింగ్ ఉందిసార్. అర్ధరూపాయ కట్టాలి" అన్నాడు పోస్టుమన్. పుల్లారెడ్డి వెనక్కుతగ్గి జేబులు తడుముకున్నాడు. పదిహేను నయాపైసలు దొరికాయి. మిగతా మిత్రుల వంక దీనంగా చూశాడు. సుబ్బారావు విసుక్కుంటూ "ఊ బయటపెట్టండిరా! ఎవడిదగ్గరెంతుందో" అన్నాడు. అందరూ మొత్తం పోగు చేశారు. నలభైతొమ్మిది నయాపైసలు చేరింది. మిగతా నయాపైసా రేపిస్తామని బ్రతిమాలి, కవర్ పుచ్చుకున్నాడు పుల్లారెడ్డి.

"ఏమని వ్రాసాౕరా మీ నాన్న?" సుబ్బారావు అడిగాడు. సుబ్బారావుకు ఆ బేరింగ్ కవర్లు పుల్లారెడ్డి తండ్రితప్ప మరెవరూ వ్రాయరని తెలుసు. అందుకే అంత నిశ్చింతగా అడిగేశాడు. పుల్లారెడ్డి పావుగంట తరువాత అప్పుడే సుబ్బారావు ప్రశ్న విన్నట్టు తలెత్తి చూశాడు. ఏడుపు మొహంపెట్టి, "నేనేమో మానాన్నకు వంద రూపాయలు అర్జంటుగా పంపమని వ్రాశామరా. ఆయనేమో పొదుపు గురించి పావుదస్తాపేపరు పాడుచేసి పంపారు" అన్నాడు.


సుబ్బారావు నవ్వుతూ "అవి శేషాచారి కివ్వు. అక్కడక్కడ కాస్త ఎడిట్‌చేసి ఏ పత్రికకన్నా పంపుతాడు. అయిదో, పదో రాలినా రాలవచ్చు" అన్నాడు.

సుబ్బారావు హాస్యానికి అన్నా ఆమాట అమలుజరిగి తీరవలసిందే. అందుచేత పుల్లారెడ్డి ఆ కాగితాల కట్టను శేషాచారికి అందించాడు. శేషాచారి "అదేదో పత్రికలో పొదుపును గూర్చి వ్యాసాల పోటీఉందట. దానికి పంపుతాను" అని దానికి అక్కడక్కడా మార్పులూ, చేర్పులూ చేసి, ఫెయిర్‌కాపీ వ్రాసేశాడు. శ్రీపతి ఎనిమిది నయాపైసల స్టాంపంటించగా, సు బ్బా రా వు రేపర్ మీద ఎడ్రస్ వ్రాసి, స్టాంపంటించి రమణారావుకు అందించాడు. రమణారావు పోస్టు చేసివచ్చాడు.

శేషాచారి "ఏమిటో మాడిపోతున్న వాసనేస్తోంది" అన్నాడు. సుబ్బారావు గబగబా గిన్నె దింపి కిందపెట్టాడు. అందరూ ఆత్రంగా గిన్నెలోకి తొంగిచూశారు. ఉప్మా కమ్మని వాసనలు విరజిమ్ముతూంది. సుబ్బారావు సగర్వంగా కాలరు సవరించుకొని "శేషాచారీ కాఫీ మాటేమిటి" అన్నాడు. శేషాచారి కాఫీపొడివేసి నీళ్ళు దించుతూ "మనం ఉప్మా ముగించేసరికి కాఫీ తయార్" అన్నాడు. సుబ్బారావు రెండు విస్తరాకులను

చీల్చి వాటిలో అందరికీ తలో పదహారు స్పూన్లూ లెక్కపెట్టి వేశాడు. పుల్లారెడ్డి అందరికంటే ముందుగా ఉప్మా నోట్లో వేసుకున్నాడు. పుల్లారెడ్డికి షాక్ కొట్టినట్లయింది. చప్పున నోట్లోది అవతల ఉమిసి, రెండు గ్లాసుల మంచినీళ్ళుతాగి "సుబ్బారావూ! ఉప్మాలో ఏమాత్రం ఉప్పుపాలు తగిలించావేమిటి" అన్నాడు. సుబ్బారావు కాస్త రుచి చూశాడు. ఉప్మాలోని ఉప్పదనానికి నాలిక అవతలూడి పడిపోతానని బెదిరించింది. సుబ్బారావు శేషాచారి దగ్గరకు వెళ్ళాడు. మిగతా ముగ్గురూ రాబోయే తుఫానుకోసం ఊపిరి బిగబట్టి, నిశ్శబ్దంగా ఎదురుచూస్తున్నారు. శేషాచారి హఠాత్తుగా ఇంత నిశ్శబ్దం వచ్చేసిందేమని వెనక్కు తిరిగి చూశాడు కాఫీ కలపడం ఆపి. వెనకను పులిలా నిలబడి ఉన్న సుబ్బారావును చూసి "ఏ... ఏ..ఏమైంది" అన్నాడు. "ఉప్పు ఎన్ని తులాలన్నావూ?" అడిగాడు సుబ్బారావు. శేషాచారి పుస్తకం చూసి "పధ్నాలుగు తులాలు" అన్నాడు. సుబ్బారావా పుస్తకాన్ని శేషాచారి చేతి నుండి లాక్కొని చూశాడు. పధ్నాలుగు తులాలనే ఉంది. పుస్తకం చివర తప్పొప్పుల పట్టిక పరిశీలించాడు. ఒకచోట ఆగి బిగ్గరగా చదివాడు. "డబ్బై ఆరవ పేజీలో ఉప్మాపాళ్లలో ఉప్పు పధ్నాలుగు తులాలకు బదులు 1.4 తులాలు (దాదాపు $1\frac{1}{2}$ తులాలు) అని సవరించుకోవాలి"—అని. సుబ్బారావు ఆ పుస్తకాన్ని శేషాచారి మీదకు విసిరికొట్టాడు.

"ఓరి చవటా! నీ తెలివిలా అఘోరిస్తుందేమిరా? పైగా కలా బ్రహ్మచారి, బి. ఏ.ఫైనలియర్ వెలగబెడుతున్న వెధవ్వి. ఆపైన స్పెషల్ తెలుగు గ్రూప్ వాడివి. ఇంకా చెప్పాలంటే పుస్తకాల పురుగువి. నువ్వా ఈ పుస్తకంలో తప్పొప్పుల పట్టిక చదవనిది. అసలు నన్నడిగితే ప్రతి పుస్తకంలోనూ ముందు తప్పొప్పుల పట్టి కుందో, లేదో చూసి, ఉంటే ముందది చదివి, తరువాత పుస్తకం చదివి తగలబడ మంటాను. నీకందరి తరఫునా ఆరు రూపాయలు జరిమానా వేశాను. వచ్చేనెలలో మనియార్డరు రాగానే మమ్మల్నందర్నీ సినిమాకు తీసుకువెళ్ళు." సుబ్బారావు జడ్జిమెంటు చదువుతున్నట్లు తీరిగ్గా చెప్పాడు. శేషాచారి గోడకు చేరగిలబడి నోరు తెరుచుకొని నిలబడ్డాడు. సుబ్బారావు శేషాచారి కాఫీ కూడా తగల బెట్టేశాడేమోఅని అనుమానంకొద్దీ కొద్దిగా రుచి చూశాడు. కాఫీ అమృతంలాగుంది. సుబ్బారావుకోపం చల్లారిపోయింది. సుబ్బారావుకు ఏదున్నా, లేకపోయినా మెచ్చుకునే గుణముంది. సుబ్బారావన్నాడు. కదా, "అబ్బాయ్! ఉప్మా నీవల్ల పాడయినా కాఫీ బాగా తయారు చేశావు కాబట్టి అపరాధం తగ్గింది. జరిమానా మూడు రూపాయలు మాత్రమే!"అని. చిన్నబోయిన శేషాచారి ముఖం కొద్దిగా వికసించింది. మిగతా ముగ్గురూ కాఫీ రెండోమారు కూడా పుచ్చుకుంటూ శేషాచారిని



మహాబలిపురంవద్ద కొత్త లైట్‌హౌస్
ఫోటో—ఎస్. వి. కె. మధుసూధనరావు (తెనాలి)

తెగమెచ్చుకున్నారు. శేషాచారి వాళ్ళతోపాటు ఆనందంలో పాలు పంచుకున్నాడు.

ఈ అయిదుగురు బ్రహ్మచారి బ్రదర్సును గూర్చి కొన్ని వివరాలు మీరు తెలుసుకోనడం అవసరం. . .

అయిదుగురూ క్లాసుమేట్సుకారు. ఆరునెల్ల ముందు మిత్రులైనా కారు. ఆ మాటకొస్తే అంతకు నూట ఎనభై రెండు రోజుల క్రిందట వారిలో ఏ ఇద్దరికీ ముఖపరిచయం కూడా లేదు. అద్దె కొంపను వెతికే ప్రయత్నంలో అయిదుగురూ ఆశ్చర్యకరంగా కలుసుకున్నారు. సుబ్బారావు ఆరునెలల క్రిందట ఒక రోజున స్థానిక దినపత్రికలో చవకలో ఒక ఇల్లద్దెకుందని చదివి, ఎగిరి గంతువేశాడు.

హడావుడిగా డ్రెస్ చేసుకొని, అక్కడికి వెళ్ళేసరికి, శ్రీపతీ, శేషగిరీ కాచుకొనుండడం చూసి విర్బాంతపోయినా, మెల్లిగా వారితో పరిచయం చేసుకున్నాడు. "మీరు కూడా ఇంటికోసమే వచ్చారనుకొంటాను" అన్నాడు సంభాషణ ప్రారంభిస్తూ. "మరే" అన్నాడు శ్రీపతి. శేషగిరి డిటో అన్నట్లు తలూపాడు. వీళ్ళ నెలాగయినా వెళ్ళగొట్టాలని సుబ్బారావు నిశ్చయించుకున్నాడు. "మీకు తెలియదేమోనండి.ఇందులో దయ్యాలున్నాయని ప్రతీతి" అన్నాడు వారిని భయపెట్టడానికి. శ్రీపతి చప్పరించేశాడు. "అబ్బే! దయ్యాలూ, భూతాలూ అంతా హంబగ్‌సార్. నేను నమ్మను. ఉంటే ఉండనివ్వండి. మరేం భయంలేదు." శేషాచారి "దయ్యాలుంటే సార్! మనకేం? ఆ లాడ్జింగ్ హౌస్ నరకంలోకంటే దయ్యాల కొంపైనా నయమే" అన్నాడు. సుబ్బారావు ముఖం అటు తిప్పి పళ్ళు కొరికాడు.

పుల్లారెడ్డి సందేహిస్తూ వసారాలోనికి

# బ్రహ్మచారి బ్రదర్సు

వచ్చాడు. ముందు ముగ్గురూ "నువ్వొకడివా" అని అనుకున్నారు ఎవరికివారే. ఆ వెంటనే రమణారావు వచ్చాడు. అందరికీ కంగారుగానే ఉంది. తానుతప్ప ఇంకెవడు ఆక్రొంపనుకాస్తా ఎగరేనుకుపోతాడేమోనని. సుబ్బారావుకు బుద్ధుడికి జ్ఞానోదయమైనట్టు హఠాత్తుగా బ్రహ్మాండమైన అయిడియా వచ్చేసింది.

"చూడండీ, మనైదుగురికి కూడా ఇప్పుడిల్లు చాలా అవసరం. అందరం అందుకోసమే వచ్చాం. మనలోమనం పోటీపడిన కొద్దీ దీనిరేటు పెరిగిపోతుంది. అలా పెరక్కుండా మనందరికీ లాభకరమైన మార్గం చెబుతాను" అని ఆగాడు సుబ్బారావు. పుల్లారెడ్డి అందరికీ సిగరెట్ ఆఫర్ చేశాడు. శేషాచారితప్ప తక్కిన వారందరూ తీసుకొని సిగరెట్లు ముట్టించారు. సుబ్బారావు మళ్ళీ ప్రారంభించాడు. "మనందరి తరపునా ఈ ఇంటిని అద్దెకు మాట్లాడుతాను. అందరూ సమానంగా అద్దెను భరించాలి. అందువల్ల ప్రతిఒక్కరికి చాలా ఖర్చు కలిసివస్తుంది. ఇల్లు పెద్దదిగానే కనిపిస్తోంది. అందరం కలిసి సవ్యంగా వాడుకొనడానికి వీలుగా ఉంటుంది. ఇక మీ ఇష్టం. మీ అభిప్రాయాలేమిటో చెప్పండి." మిగతా నలుగురూ కాస్సేపు ఆలోచించారు. తమలోతాము పోటీపడి, నష్టపడేకంటే ఈ పద్ధతే లాభకరంగా కనిపించింది.

ఆరు నెలల క్రిందట వారు ఏకగ్రీవంగా అంగీకరించిన మొదటి విషయమదే. సుబ్బారావు బేరాన్ని సెటిల్‌చేసి, ఇల్లు కుదిర్చేశాడు. ఆనాడే బ్రహ్మచారి బ్రదర్సు సంఘం ప్రారంభమైంది. వారిమధ్య మైత్రి పెరిగింది. సుబ్బారావు వారిపై నాయకత్వం వహించాడు. ఆనాడు తన మాటెలా నెగ్గించుకున్నాడో, ఆరు నెలల తరువాత కూడా ఆ అధికారాన్ని నెగ్గించుకుంటున్నాడు. మిగతా నలుగురికీ సుబ్బారావు ఆపద్బాంధవుడు. ఏ సమస్య పరిష్కరించవలసి వచ్చినా, డబ్బు కావాలన్నా, ఎక్కడికైనా వెళ్ళాలనుకొన్నా సుబ్బారావే అందుకు పూనుకోవాలి. ఇదేవారి పూర్వచరిత్ర.

సుబ్బారావు ఎగ్జిబిషన్‌కు వెళ్ళాలని ప్రణాళిక వన్నాడుకదా! దానికి సన్నాహాలు ప్రారంభమయాయి. తీరా మేకప్పూ, డ్రెస్సింగూ పూర్తయిన పావుగంట తరవాత రమణారావు రెండోమారు స్నోముద్ద ముఖానికి పులుముకుంటూ తన ధర్మసందేహం బయట పెట్టాడు. "మరి డబ్బురా? సుబ్బారావూ?" అని. సుబ్బారావు, క్రాపుకు వంకీలు దిద్దుకుంటున్నవాడు అద్దం ముందు శిలావిగ్రహంలా రెండు నిమిషాలు నిలబడ్డాడు. కాస్సేపట్లో తెలివి తెచ్చుకున్నాడు. ఆలోచించి "ఒరే! శ్రీపతీ! నువ్వు రోజా పేపరు కొంటున్నావు కదూ?" అనడిగాడు సుబ్బారావు. శ్రీపతి అవునవగానే అవన్నీ పట్టుకొని రమ్మన్నాడు. శ్రీపతి తెచ్చిన పేపర్ల కట్ట రమణారావుకిచ్చి అవి అమ్మిరమ్మన్నాడు. పాపం! ఇలాంటి డ్యూటీలన్నీ రమణారావుకే పడుతూ ఉంటాయి. ఒకమారు సుబ్బారావు రమణారావు ప్రాణప్రదంగా చూసుకొనే సైకిల్‌నిమ్మన్నాడు. ఆపనేమిటో తను చేసిపెడతానుగానీ సైకిలు ఇవ్వను పొమ్మన్నాడు రమణారావు. సుబ్బారావు "అయితే ఇవాళ్టినుండీ అర్జంటు పనులన్నీ నువ్వే చేస్తూండు" అని శపించిపారేశాడు. ఆశాపన్నుండి రమణారావుకు విముక్తి కలుగలేదు.

రమణారావుకు ఆ సైకిలంటే అంత ప్రేమెందుకంటే.....

ఒకనాడు...

కింగ్‌కోఠీ రస్తాను క్రాస్ చేస్తున్న సుమిత్రను ఫర్లాంగు దూరాన స్టేట్‌బ్యాంక్ దగ్గరున్న రమణారావు చూసి, తన ద్విచక్రశకటాన్ని ఆరోహించి శరవేగంతో దూసుకు వచ్చేశాడు. రోజూ లాగానే సుమిత్రను కవ్వించాలనే దురాశతో బ్రహ్మాండమైన వేగంతో సుమిత్ర పక్కనుండి వచ్చేశాడు రివ్వున. సుమిత్ర కెవ్వుమంది. దయ్యంలా సమయానికి డబుల్‌డెక్కర్ బస్సొకటి దాపురించింది. సైంధవుడిలా, పానకంలో పుడకలా సుమిత్ర, రమణారావుల మధ్య అడ్డు పడింది. రమణారావు కంగారుగా సైకిల్ని పక్కకు తప్పించాడు. పట్టపగ్గాల్లేని, తప్పు,తప్పు, బ్రేకులు పట్టని ఆశకటరాజం రమణారావు నిర్దేశించిన చోటుకు పదిహేను గజాలు ముందుకు వెళ్ళి ఆగేలోగా టకటకా అరడజను సీన్లు మారిపోయాయి. పాతికేళ్ళ వయస్సున్న ఆ శకటరాజం సుమిత్ర అడుగెత్తున పేర్చిపెట్టుకున్న పుస్తకాల దొంతరను మూడడుగుల దూరానికి పడగొట్టి, ఎడంచేతిలోని టిఫిన్‌బాక్సును నేలకరిపించి, దారిలో వెళ్తున్న సేఠ్‌గారిని పరామర్శించి, కొంతమందిని మీదకొచ్చేస్తున్నానని భయపెట్టి, చివరికెలాగైతేనేం ఆగింది. అదేనాడో రమణారావు చేసుకున్న పుణ్యఫలితమై ఉండాలి. లేకుంటే ఆ సైకిలు అంత తొందరగా ఆగే అలవాటేవాడూ లేదు.

అంతమందికీ కలిపి ఒకేమారు "అయాంస్ వెరీ సారీ" అంటూ సైకిలు తాపీగా దిగబోతున్న, దిగిన రమణారావు అరిటిపండు తొక్కమీద కాలేసి, జారిపడి, అంతకుముందు వానకురియగా చేరిన బురదనీళ్ళలోనికితిన్నగాఎగుమతై పోయాడు. పరాభవంతో కోప్పడబోతున్న సుమిత్ర అమాంతం కోపాన్ని మరిచిపోయి, ఫక్కున నవ్వేసింది. ఒక కాలేజీ స్టూడెంటు,సుమిత్ర పుస్తకాలన్నీ రోడ్డుమీంచి ఏర్చికూర్చి వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌లా పైకెత్తాడు. "అయ్యబాబోయ్" అనుకున్నాడు లోలోపలే. ఏడెనిమిది కిలోగ్రాముల బరువు ఉండవచ్చు. ఇంత బరువును అమ్మాయిలు అంత సునాయాసంగా ఏలా మోసుకుపోతారు చెప్మా అని ఆశ్చర్యపడుతూ అనుకున్నాడు. కాలేజికి వెళ్ళేటప్పుడు అణాఅద్దె డిటెక్టివ్ నవలా, రఫ్ నోట్‌బుక్కూ తప్ప మరొక్కటి కూడా భరించలేని అనుకుమారుడు ఆశ్చర్యపడ్డాడంటే అందులో ఆశ్చర్యం లేదు. ఆయాసపడుతూ వచ్చిన అతని చేతిలోనుండి పుస్తకాల దొంతరను అతి సునాయాసంగా అందుకుంటూ "మెనీథాంక్స్" అంది సుమిత్ర. ఆ విద్యార్థి తబ్బిబ్బయిపోయి, "నో మెన్షన్స్ ప్లీజ్" అనబోయిఅనబోయి "మెన్షన్స్ నో ప్లీజ్" అనేశాడు. ఇక్కడ ఈ తతంగం జరుగుతూండగా అక్కడ రమణారావు లేచి నిలబడ్డాడు. బురదకొట్టుకున్న దుస్తులను చూసి నిట్టూరుస్తూ సైకిలు లేవదీశాడు. చస్తే ఒక్కంగుళం కూడా కదలనని సైకిలు భీష్మించింది. రమణారావు పరిశీలనగా చూశాడు. ముందుచక్రం ముచ్చటగా మూడు వంకర్లు తిరిగి మూతిబిగించుకుంది. ఆపద్బాంధవుడుపోలీసు కానిస్టేబిలు అవతరించాడు. హరి! భగవంతుడా అనుకొనబోయిన రమణారావు పోలీసును చూసి స్వగతంగా అనబోయి "ఆ పోలీసా!?" అనేశాడు పైకే. కానిస్టేబులు కేసుడైరీ తీశాడు. సుమిత్ర ఆ సమీపాన పడున్న టిఫన్‌బాక్సును తీసుకొనడానికి వచ్చింది. కానిస్టేబిలు ఆమెను చూసి "మీరు స్టేట్‌మెంటివ్వాలి" అన్నాడు. సుమిత్ర మొదట రమణారావు వంక కోపంగా చూసి, తరువాత జాలిపడి "అవసరం లేదు" అంది. రమణారావు టిఫిన్‌బాక్సు తీసి సుమిత్ర కందించాడు. సుమిత్ర "థాంక్స్" చెప్పి బస్

## కాళ్ళ పొడవు

*డగ్లస్ మరుగుజ్జు మనిషి. అబ్రహామ్ లింకన్ మిత్రులు కొందరు డగ్లస్ అవకరాలు గురించి చాలా సేపు చర్చించుకొన్నారు. ఆ తరువాత మనిషి అన్నవాడి కాళ్ళు ఎంత పొడవు ఉండాలి అన్న విషయం చర్చకు వచ్చింది. అందరూ తమకు తోచిన అభిప్రాయాలు వెలిబుచ్చుతున్నారు. అంతలో లింకన్ అక్కడికి వచ్చాడు. "మీ అభిప్రాయం ఏమిటో చెప్పండి" అని మిత్రులు కోరినారు.*

*ఒక క్షణం ఆలోచించి లింకన్ అన్నదిది : "మొండెంనుంచి నేల దాకా ఉండాలని నా అభిప్రాయం."*

ప్టాప్‌వంక నడిచింది. కానిస్టేబిల్ కేసు పోతున్నందుకు కొరకొరా చూసి "మీరు చాలా రాష్‌గా సైకిలు తొక్కుతున్నారు. జాగ్రత్తగా *తొక్కుతూండండి*" అని వార్నింగిచ్చి విశ్రమించాడు. సైకిలు చెడినా, సుమిత్ర పరిచయం లభించినందుకు సంతోషిస్తూ, సైకిల్ రిపేరింగ్ షాపు వంక నడిచాడు. ఆనాటి నుండీ రమణారావు తన సైకిల్ని ఎవర్నీ తాకనివ్వకుండా, అతి ముద్దుగా పోషించుకుంటున్నాడు...

రమణారావు అరగంటలో ఆరున్నర రూపాయలతో వచ్చిపడ్డాడు. బ్రహ్మచారి పంచకం ఇంటికి తాళంవేసి, వీధినపడ్డారు. బస్‌స్టాండ్ దగ్గర అయిదుగురూ ఆగారు. శ్రీపతి రమణారావును మోచేత్తో పొడిచి ఏమో చెప్పబోయాడు. ఈ తిరుగుబాటును ఓరకంటితో చూస్తున్న సుబ్బారావు సహించలేక, తనకాలితో శ్రీపతి కాలునొక్కి "జాగ్రత్త! వెధవ్వేషాలేశావంటే చంపేస్తాను" అని కాస్త బిగ్గరగానే అన్నాడు. కాలినొప్పికన్నా ఆ అమ్మాయిలు ఈ మాటలు వినలేదు గదా అనే అనుమానమే శ్రీపతిని ఎక్కువగా వేధించింది. రమణారావు తన చూపులు అక్కడే ఉన్న సుమిత్ర మీదే పడేసుంచాడు. సుబ్బారావు రమణారావు దృష్టిని ఆకర్షించి, ఇటు తిప్పడానికి మెల్లిగా దగ్గాడు. తన్మయత్వంలో ఉన్న రమణారావు గమనిస్తేగదా? సుబ్బారావు శ్రీపతిని వెనక్కు లాగేసి, తాను వెళ్లి రమణారావు పక్కన నిలబడ్డాడు. రమణారావు చేతిని మెల్లగానొక్కాడు. రమణారావు షాక్ కొట్టినట్లయి ఈ వంక తిరిగాడు. సుబ్బారావు నవ్వుతూ నిలబడ్డాడు. బస్సొచ్చింది. అందరూ ఒకరినొకరు తోసుకుంటూ బస్సెక్కారు. అతి ప్రయాసమీద శేషాచారిని బస్సులోనికి నెట్టి, సుబ్బారావు ఫుట్‌బోర్డుమీద నిలబడ్డాడు. బస్సు ముందుకు సాగింది. రమణారావు బస్సులో సుమిత్రకు ఆరంగుళాల దూరంలో నిలబడవలసి వచ్చింది. గుండె ఎక్స్‌ప్రెస్ వేగంతో కొట్టుకుంటూంది. చెమటలు తెగపోస్తున్నాయి. రుమాలు తీసి, తుడుచుకొనబోయి, బస్సు కుదుపుకు తూలి ఆ అమ్మాయిని కాస్త ఢీకొట్టేసి "సారీ" అంటూ యథాస్థానానికి మళ్ళాడు. సుమిత్ర రమణారావు పడే అవస్థ చూసి నవ్వుకుంటూంది—ఈ అబ్బాయికింత కంగారెందుకో అనుకుంటూ. రోజూ సుమిత్ర బస్‌స్టాండ్‌కు వచ్చేసరికి రమణారావు సైకిలు మీద బయలుదేరి, ఆమెను చూస్తూ వెళ్ళడం రివాజు. బస్సు గట్టిగా కుదిపి ఆగింది. కలలు కంటున్న రమణారావును సుబ్బారావు చెయ్యిపట్టుకుని బయటకు లాగేశాడు.

రెండు నెలల తరువాత...

సుబ్బారావుశేషాచారికిహితోపదేశంచేస్తున్నాడు. శేషాచారి అర్జునుడు శ్రీకృష్ణుడు భగవద్గీతోపదేశం చేస్తుండగా ఎంత శ్రద్ధ చూపించాడో అంతకు రెట్టింపుశ్రద్ధ నటించేస్తున్నాడు. మిగతాముగ్గురూ అపరబుద్ధావతారాల్లాగా నిశ్శబ్దంగా కూర్చుని ఆలకిస్తున్నారు. సుబ్బారావు సంసారయోగాన్ని గూర్చీ, సంసార సాగరంలోని కష్టాలను, నష్టాలను గూర్చీ ఏకరువు పెట్టి చివరికి తాత్పర్యం చెప్పాడు. "శేషాచారీ! పెళ్ళి చేసుకున్న కొన్నాళ్ళకు పెళ్ళాం చేతిలో కీలుబొమ్మవై తోలుబొమ్మవై కుటుంబయ్యవై పోతావు. ఆపైన మరి కొన్నాళ్ళకు సంతానం పెరుగుతున్న కొద్దీ కుచేలరావు వైపోతావు. నీ ఇష్టం మరి".

శేషాచారి సుబ్బారావు దంచిన ఊకదంపునంతను చెరుకు పిప్పినంతనూ, హాలాహాలంవంటిదాన్ని అంతవరకూ నిశ్శబ్దంగా దిగమింగాడు. కానీ అందులో ఏదీ శేషాచారికి అరగలేదు. కనుక ఈ చెవిలోంచి విని ఆ చెవిలోంచి వదిలేశాడు. అఖరికన్నాడు గదా— "సుబ్రావ్! మానాన్నసంబంధంసెటిల్‌చేశాడురా. పైగా కట్నం కూడా అడ్వాన్సు తెచ్చేసుకున్నాడట. ఆపైనేమో నా అంగీకారం కూడా పుచ్చేసుకున్నారు. అందుచేత ఇప్పుడు పెళ్ళి చేసుకొనడం తప్పనిసరి. నేనిప్పుడు కాదూ, కూడదన్నానో మానాన్న వచ్చి నన్ను బలవంతాన లాక్కుపోయి, మెడలు విరిచైనా పెళ్లి చేయడం ఖాయం. నీ మాట మీరినందుకు మన్నించాలి" అని.

సుబ్బారావు కాస్సేపు గుర్రుగా చూశాడు శేషాచారి వంక. మొదటి మారుగా శేషాచారి సుబ్బారావు మాట నిరాకరించాడు. కానీ సుబ్బారావెందుకనో శేషాచారిని క్షమించేశాడు. "అజ్ఞానివి. సరే! అనుజ్ఞ ఇస్తున్నాను. పెళ్లి చేసుకో. ఏనాటికైనా ఈ సుబ్బారావు మాటలు నిజమని నిలకడమీద తెలుసుకొనకపోవు. అయ్యో! సుబ్బారావూ! ఆనాడు నీమాట వినకపోతినే అని అనుకోకాపోవు" అన్నాడు. శేషాచారి సుబ్బారావు ఒప్పుకున్నందుకు, ఏనుగెక్కినంత సంబరపడ్డాడు. తాను క్రిందటిరోజు అందుకున్న శుభలేఖల కట్టలోనుండి నాలుగు తీసి అందరికీ తలొకటి ఇచ్చాడు.

బయట "మనియార్డర్ సార్" అని కేక వినిపించింది. సుబ్బారావు బయటకు పరుగెత్తబోతున్న అందర్నీ ఆపి, "ఎవరికి" అనడిగాడు. "శేషాచారిగారికి సార్! సుప్రభాతం పత్రిక ఎడిటర్ నుండిఏభై రూపాయలు" అన్నాడు పోస్ట్‌మన్. శేషాచారి సంతకంచేసి డబ్బు తీసుకున్నాడు. సుప్రభాతం పత్రిక కూడా ఇచ్చేసి పోస్ట్‌మన్ వెళ్ళిపోయాడు. సుబ్బారావు పత్రిక తిరగేశాడు.ఆనాడు సుబ్బారావు శేషాచారి చేత సరిచేయించి, పంపిన పొదుపు గురించిన వ్యాసం ప్రథమ బహుమతిని అందుకుంది. సుబ్బారావు పుల్లారెడ్డి వంకచూస్తూ "మీనాన్న డబ్బు పంపకపోయినప్పటికీ ఏభై రూపాయల విలువగల ఇది బహూకరించార్రా. అందుచేత ఈ డబ్బు నీదే. ఏం చేద్దామంటావు దీనితో" అనడిగాడు. పుల్లారెడ్డి కాస్సేపు ఆలోచించి,


తాంబూలములకు
యాలకాయ,లవంగము యిప్పుడు అక్కరలేదు.

# రుచి

సుగంధ ద్రవ్య సముదాయము.
పచ్చకర్పూరం, కుంకు పువ్వు చేర్చబడినది.
అన్ని కిరాణా కొట్లలో దొరకును.
కిళ్లీకొట్లలో వాడబడుచున్నది.
¼ పౌ. రు. 3—25, పోస్టేజి అదనం.
నానాకాస్మటిక్సు, విజయవాడ—2.




దొంగల బారినుండి అడవి జంతువుల నుండి మిమ్ము మీరే కాపాడుకోండి. యాత్రీకులకు,వన భోజనాలకు, డ్రామాలకు ఉపయోగకరం. తేలికైన 6 గుండ్ల ఆటోమటిక్ రివాల్వరు. దాని రవ్వలు కన్నులకు మిరుమిట్లు గొల్పును.

| 777 | 888 | 999 |
| --- | --- | --- |
| రు 8/— | రు 10/— | రు 15/— |

25 తోటాలు ఉచితం
అదనంగా 100 తోటాలు రు 5—తోలి నంచి రు 6— లైసెన్సు అవసరంలేదు
పోస్టేజి రు 2— అదనం
INDIAN CHAMBER OF SCIENCE,
(P-A.P.) Jullundur City.

క్యాలెండర్లు

నాణ్యమైన ఫోటో అఫ్‌సెట్ క్యాలెండర్లకు మమ్ము సంప్రదించండి. క్యాలెండరు బొమ్మలను క్యాలెండరు మాన్యుఫ్యాక్చరర్లకు, ప్రింటర్లకు ప్రత్యేక ధరలకు సప్లయి చేయుదుము. మంచి కమీషన్‌పై పనిచేయుటకు సమర్థులైన ఏజంట్లు కావలెను. వ్రాయండి :
Ajanta Art Calendar Mfg. Co.,
P.B. 255, Madras-1.

SWASTIK.

"హోటల్లో అందరూ కడుపు పట్టేనంత తినండి. ఇవాళ రెండు సినిమాలు చూసేద్దాం. మిగిలిన డబ్బుతో ఏదైనా కొని శేషాచారికి పెళ్ళి కానుకగా బహూకరిద్దాం" అన్నాడు.

మరి పదిహేను రోజుల తరువాత....

బయట మేళతాళాలు శ్రోతల చెవులను హోరెత్తిస్తున్నాయి. ఆధ్వనిని యధాశక్తిని అణచేస్తూ మైకులో అరిగిపోయిన పాత రికార్డొకటి అర్ధంకానిగీతికను దేన్నో ఆలాపిస్తూంది. పెద్దలు, పిన్నలు సాధ్యమైనంత అధికస్థాయిలో మాట్లాడే మహాధ్వని ఆరెంటినీ మించెత్తుతూంది. ఇంతగొడవ అవతల జరుగుతూండగా ఆ ప్రపంచంతో తనకు సంబంధం లేనట్లు, ఒక గదిలో కూర్చున్న మిత్ర బృందం ఇరవై ఆరవసారి పేకాటలో మునిగి తేలుతున్నారు. సుబ్బారావు ముక్కలు చకచక పంచిపెడుతున్నాడు.

ఒకటీ... రెండూ... మూడూ...

చకచకా తిరిగిపోయింది. సుబ్బారావు తిరిగి ముక్కలు కలపడం మొదలు పెట్టాడు. రమణారావు అప్పటికి ఎనిమిది ఆటలనుండీ వరసగా గెలుస్తున్నాడు. హఠాత్తుగా తలెత్తి చూసి, అప్పటినుండి పరాకు చిత్తగించసాగాడు. సుబ్బారావు పంచిన ముక్కలు యాంత్రికంగా అందుకున్న రమణారావు ఆ ముక్కలేమిటో సరిగ్గా చూడనేలేదు. అతని చూపవతలే ఉండి పోయింది. రెండు టర్న్లు తిరిగి రమణారావు దగ్గరకు వచ్చింది ఆట. రమణారావు ఒకటీ అన్నాడు. పక్కనే కూర్చున్న సుబ్బారావు చిన్న దెబ్బతో రమణారావును కాస్త మేల్కొల్పి ఇది మూడని చెప్పాడు. రమణారావు క్రింద ముక్కలెత్తి, తురుపు చెప్పాడు. ఆట మొదలైంది. రమణారావు ఆ పరాకునుండి తేరుకోకముందే సుబ్బారావు అన్నాడు—"రమణారావ్! కుదేల్! పెట్టరా నాయనా! అక్కడ మూడు రూపాయలు" అని. అప్పటికి రమణారావు తెలివి తెచ్చుకొని చూసుకున్నాడు. అవతల వారికి రావలసినపట్లు వచ్చేశాయి. తనకు రెండు పట్లు తక్కువ. రమణారావు కుదేలు క్రింద మూడు రూపాయలు పంచి పెట్టాడు. రమణారావు మిగతా ముక్కలు చూసిన సుబ్బారావు నోరు తెరిచాడు. "ఓ నీ తెలివి తగలబడ. తురుపు ఆసు, రాజు ఉంచుకొని పొడి ఆడేవేంరా? అవి ముందాడి ఉంటే ఆట నీదేకదా. అసలు నీకు ఒంటిమీద తెలివి ఉందాంట?" రమణారావు ఈ మాటలు చెవినిపడనట్లు దూరంగా ఎక్కడికో చూస్తున్నాడు. వెనక్కుతిరిగి కూర్చున్న సుబ్బారావు ద్వారంవంక ముప్పై డిగ్రీలు వాలుగా తలతిప్పి,అరవై డిగ్రీల కోణంలో వెనక్కు తిరిగి చూశాడు. అక్కడికి పది గజాల దూరాన నిలుచునిఉందా రెండుజడల అమ్మాయి సుమిత్ర. "హా! తెలిసెన్" అన్నాడు సుబ్బారావు తల ఇటు తిప్పుకుంటూ. "ఏమిటేమిటి" అన్నారు రమణారావు తప్ప మిగిలినవారు. "మన రమణారావు గాడి ఊహా సుందరి. ఇక్కడి కెలా వచ్చిపడిందంటా." శేషాచారి కూడా తొంగిచూశాడు. "చచ్చాంరోయ్. కొంపదీసి మనవాడి ప్రతాపాలను గురించి ఇక్కడ ఎవరితోనైనాచెప్పిందీఅంటేమనంబిచాణా చంకను పెట్టుకొని కాలికి బుద్ధి చెప్పాల్సిందే" అన్నాడు పుల్లారెడ్డి పేకదస్తాను కత్తెరవేస్తూ.

ఆ అమ్మాయి అయిదు నిమిషాల పాటు రమణారావు వంక పరీక్షగా చూసి వెళ్లిపోయింది. పేకాట జోరు తగ్గి, మాటల జోరు హెచ్చింది. మరి అయిదు నిమిషాల్లో శేషాచారి మామగారూ, మరొకాయనా వచ్చి కూర్చున్నారు. శేషాచారి మామగారు "ఈయన మురళీధరరావుగారని హైదరాబాద్‌లో పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా ఉంటున్నారు. వీరి అమ్మాయి సుమిత్ర మీ అందరికీ తెలుసనుకొంటాను" అన్నారు. మురళీధరరావుగారు రమణారావును చూపిస్తూ "అందరికంటే బాగా ఇతనికి తెలుసు" అన్నారు. రమణారావుకు గుండెల్లో దడ ప్రారంభమయింది. వేరకపోయి ఈ పెళ్ళికి వచ్చానురా భగవంతుడా అనుకొంటున్నాడు. మురళీధరరావుగారు పోలీస్ స్టేషన్‌లో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రమణారావును ఒకొక్క ప్రశ్నవేస్తూ,అతని భోగట్టా అంతా కనుక్కున్నట్లు గ్రహించి సుబ్బారావు ఇంకేమవుతుందోనని ఆందోళనగా చూస్తున్నాడు.

ఆసరికి మురళీధరరావుగారు రమణారావు తండ్రి అడ్రస్ తీసుకొని లేస్తూ "సరే! మీ నాన్నగారికి ఉత్తరం వ్రాస్తాలే" అన్నారు సీరియస్‌గా. రమణారావు బిక్కమొహం వేశాడు. ఆయన కాస్సేపాగి "ఎందుకంటే ముహూర్తం పెట్టించి, తాంబూలాలు పుచ్చుకొనేందుకు" అని నవ్వుతూ వెళ్లిపోయారు. రమణారావు ముఖం గ్యాసులైటులా వెలిగింది. మిగతా నలుగురూ రమణారావు వీపు సాపు చేశారు సంతోషంకొద్దీ. రమణారావు తలెత్తి చూసేసరికి అంతవరకూ అతనివంకే చూస్తున్న సుమిత్ర తుర్రుమని పరుగెత్తింది. రమణారావు సంతోషాని కానాడు కొతతబడ్డలేదు.

సంవత్సరం తరువాత......

బ్రహ్మచారి బ్రదర్సులో ముగ్గురు మిగిలారు. శేషాచారికి ఆడపిల్ల....

రమణారావు భార్య సుమిత్ర మరో మూడు నెలల్లో జోలపాటలు పాడడానికి తయారుగా ఉంది.......

పుల్లారెడ్డి ఫిలాసఫీ వంటబట్టక, పెళ్ళి చూపుల ఘట్టంలో పడ్డాడు.....

శ్రీపతి ఉద్యోగ పర్వంతో తిరుగు తున్నాడు...

సుబ్బారావు నూటపాతికరూపాయల జీతంకోసం నిమిషానికి ఏభై పదాల వేగంతో రోజు కెనిమిది గంటలు టైపు మిషన్ మీద పరుగిడుతూ మరోవంక బ్రహ్మచర్యవ్రతాన్ని సాగిస్తూనే ఉన్నాడు... ★


నెర్విటాల్

నరముల బలహీనతకున్నూ, రక్తపోటునకున్నూ రామబాణము. అనుభవ యుక్తముగా చేయబడినది.

8 ఔ సీసా 5-75 పోస్టేజి 1-75

ఇండియన్ మెడిసిన్ హౌస్,
విజయవాడ-2.

డాక్టరు కండి

ఇంట్లో కూర్చుని, పోస్టల్ ట్యూషన్ ద్వారా, గవర్నమెంటు రిజిష్టరు కాలేజినుంచి మీరు ఒక డిప్లమో పొంద వచ్చును. ఫ్రీ ప్రాస్పెక్టస్‌కు వ్రాయండి.

**Indian Homoeopathic College**
**(A.W.P.) Jullundur City**



మీరు చదవాలి

జీవిత రహస్యాలు:- మీ దాంపత్యసుఖానికి అనేక కామ సూత్రాలు :-...... రూ. 3-50
యువతి :- స్త్రీలను గురించి అనేక కుతూహల విషయాలు........ రూ. 3-50.
సంతానము:- గర్భనిరోధానికి 60 నవీన సులభ మార్గాలు.............. రూ. 3-50
పోష్టు ఖర్చులు చితం. క్రింది ఎడ్రస్సుకు వ్రాస్తే వి. పి. పోష్టు ద్వారా మీయింటికి పంప బడును

దేశసేవ ప్రచురణలు, ఏలూరు, (ఆంధ్ర)

మీ అందానికి



గ్లోరియా అనే సౌందర్యపోషక ద్రవం, ముదిరూపును పోగొట్టి మీ ముఖానికి, చక్కని లేతదనాన్ని కాంతిని తెచ్చును. మొటిమలు, మచ్చలు, ముడుతలు, ఎండకువచ్చిననలుపును పోగొట్టి, ముఖాన్ని తెలుపుచేసి మీఅందాన్ని రోజు రోజుకీ ఎక్కువ చేయును. మొదటి పూతలోనే కొంత అందము వచ్చును. వాడిచూస్తే విడువరు. అన్నిషాపులలోను దొరకును

జనితా ప్రొడక్ట్సు, ఏలూరు, (ఆంధ్ర).